సౌందర్యరాశి
అయిన ప్రేయసి
అందవిహీనంగామారినా
అతను ప్రేమించాడా?

# కాలిమువ్వనై

అభిమన్యు
కథ

ఆకాశం మబ్బు చీర కట్టుకున్నట్లుగా ఉంది. ఏ నిమిషంలోనైనా వర్షం కురిసేట్లుగా ఉంది. చల్లని గాలులు గోదావరి మీంచి వీస్తున్నాయి. ఉండుండి ఉరుములు ఉరుముతున్నాయి. మెరుపులు మెరుస్తున్నాయి.

గోదావరి ఒడ్డున పచ్చని పచ్చిక మీద కొబ్బరి చెట్టుకి ఆనుకొని గౌతమి బ్రిడ్జి మీద వాహనాల రాకపోకల్ని చిన్నపిల్లాడిలా చూస్తున్నాడు సాగర్. ఇహ వర్షం వచ్చేట్టుగా ఉంది లేద్దామని అనుకున్నాడు. అంతలో రివ్వుమని గాలి కెరటం అతన్ని తాకింది. మరుక్షణం ఓ వోణిగుడ్డ ఎక్కణ్ణుంచి ఎగురుకుంటూ వచ్చిందో అతని ముఖాన్ని కప్పి వేసింది. తక్షణం "సారీ..." అన్న పదంతో ఆ ముసుగును ఎవరో తొలగించారు.

మబ్బు పరదా నుండి బయటపడిన సూర్యుడిలా సాగర్ ముఖం ముసుగు తొలగిన క్షణం నుంచి వెలిగిపోసాగింది. అందుక్కారణం? "ఆమె... ఎదురుగా ఆమె... ఎరుపు రంగు లంగా జాకెట్‌లో. సన్నని బంగారు తీగె".

"సారీయండీ...!" చక్కని పలువరుస బయటపెట్టి శబ్దం రాకుండా నవ్వి చేతిలోని తెల్లని జార్జెట్ వోణీ గుండెలపై వేసుకుంది. అప్పుడు చూసాడు శంఖులాంటి మెడపైనున్న పెసర బద్దంత పుట్టుమచ్చను. ఆ మచ్చ వలన మెడకి అందం వచ్చిందో! మెడ వలన మచ్చకి అందం పెరిగిందో తెలియదు.

"మీ పేరు...?" రెప్పవేయడం మరచి ఆమెనే చూస్తూ అడిగాడు సాగర్.



ఆమె తన మెడన్ను కాస్త ముందుకి వంచి 'సంధ్య' నెమ్మదిగా అని, మరుక్షణం 'వర్షం... వర్షం...'' అని వెనుదిరిగింది.

అప్పటికే పెద్దపెద్ద చినుకులు.. "నేను ముందుగా హెచ్చరించాను, అయినా వినిపించుకోలేదు తడూ..' అని వర్షం సాగర్‌ని పూర్తిగా తడిపేసింది, ఇహ గత్యంతరం లేక ఆ చెట్టుకిందే నిలుచున్నాడు.

"సంధ్య! ఎంత బాగుంది..!"

"ఎవరీమె..!?"

"రవివర్మ కుంచె నుండి జారిపడిందా..!"

"వడ్డాది పాపయ్య గీతల్లోంచి వచ్చిందా..!"

"బాపు బొమ్మలకొలువు కాదని వచ్చిందా...!"

ఏమో! ఏమైతేనేం అపరంజి బొమ్మలా వుంది.

* * *

పరిసరాలు ప్రకాశవంతంగా ఉన్నాయి. వర్షంకి తడిసిన నేల మట్టివాసన వస్తుంది. సాగర్ కాలుగాలిన పిల్లిలా ఆ పచ్చికమీద తిరుగుతున్నాడు. ఇంతకు ముందులా గోదావరిని చూడ్డం లేదు. బ్రిడ్జి వైపు చూడ్డం లేదు. కోవెల గోపురం మీద గెంతుతున్న కోతిపిల్లల్ని చూడ్డం లేదు. మరి...! నిన్న 'తళుక్' మని మెరిసి మాయమైన మెరుపు తీగె కోసం చూస్తున్నాడు. కాదు... కాదు... వెదుకుతున్నాడు.

సాగర్ ఉద్యోగరీత్యా ఆ ఊరి బ్యాంకుకి ప్రమోషన్ మీద వచ్చాడు. ఊరు కొత్త. సాయంత్రం బ్యాంకు అయిపోయాక ఏం చేయాలో తోచేది కాదు. అందుకే ప్రతిరోజూ గోదావరి ఒడ్డున కూర్చొని ప్రకృతి అందాల్ని తిలకిస్తూ ఆనందించేవాడు.

"హలో...!"

వీణ మీటినట్లు వినిపించింది. సాగర్ వెనుదిరిగి చూసాడు. ఎదురుగా నవ్వుతూ ఆమె.

"అబ్బా! ఎంత అందంగా ఉంది! కడిగిన ముత్యంలా, అరవిరిసిన మల్లెలా. తెల్లని దుస్తుల్లో దివి నుండి భువికి ఏతెంచిన దేవకన్యలా...!"

"వర్షం అంటే ఇష్టమా...?"

సాగర్ అవుననలేదు. కాదనలేదు. ఆమెనే చూస్తున్నాడు.

నిజానికి చిన్నచిన్న చినుకుల్లో తడవడమంటే చాలా ఇష్టం. నిన్నటిలా తడిసి ముద్దయి పోవడమంటే చిరాకు. ఆ విషయమే చెబుదామనుకున్నాడు. కాని... అతని గొంతు పెగిలితే కదా!

"హలో! ఇలాగే చూస్తూ నిల్చుంటే నిన్నటిలాగే వర్షం వస్తుంది..." అని ఆమె అక్కడ్నుంచి కదిలింది.

కనులు ముందర సుందర రూపం కదిలేసరికి సాగర్ తేరుకున్నాడు. అప్రయత్నంగా అతని పెదవులు ఆమె పేరును ఉచ్ఛరించాయి. 'సంధ్యా!' యని.

సిరిమువ్వల శబ్దంతో నెమ్మదిగా నడుచుకుంటూ పోతున్న ఆమె ఆ పిలుపు విని ఆగింది. తలవెనక్కి తిప్పి ఏమిటి? కళ్లతో అడిగింది.

సాగర్ ఆమె దగ్గరికి వెళ్ళి, చేతులు కట్టుకొని "నీ పేరు బాగుంది", అని ఆమె కళ్ళల్లోకి చూసి చలించిపోయాడు. ఎంత ఆకర్షణ శక్తి ఆ కనులకు! ఎంతోసేపు చూడలేకపోయాడు. అతని దృష్టి సంపెంగ లాంటి అందమైన నాశిక నుంచి, ముద్ద మందారంలా ముడుచుకునున్న చిన్ని నోరు నుంచి, మెడమీద శాశ్వత స్థానం పొందిన పుట్టుమచ్చ మీద నిలిచింది.

"పేరేమా...!?"

అమాయకంగా అడిగినట్లుగా ఉన్నా, కళ్లల్లో కొంటెతనం.. నవ్వు దాచుకుంటున్న పెదవులు సాగర్ దృష్టిని దాటిపోలేదు.

'నీవు అందంగా ఉన్నావు' అని అంటే సరిపోతుందా! ఇంతటి సౌందర్య రాశిని తనెప్పుడూ చూడలేదు. ఆమెది సాధారణమైన అందం కాదు. పసుపు, ఎరుపు రంగుల కలయికతో మెరిసిపోతున్న ఆమెను చూసి చలించనిది ఎవరు!

సాహసించి సాగర్, ఆమె చేతిని అందుకున్నాడు. 'ఆహా! గుప్పెడు మల్లెపూలు చేత్తో పట్టుకున్నట్లుగా ఉంది'. "నిన్ను ప్రేమిస్తున్నాను...!" అని ఆమె చేతిని ముద్దాడబోయాడు. కాని, ఆమె తన చేతిని వెనక్కి లాగింది. అది గమనించి సాగర్ గట్టిగా పట్టుకున్నాడు. ఆమె చేతి వేళ్లు తనచేతిలో చిక్కుకున్నాయి. ఈ గుంజులాటలో ఆమె పైటజారి నేలను తాకింది. సాగర్ కళ్లు చెదిరాయి.

మామిడి కాయలలో బరువెక్కిన కొమ్మ చిరుగాలి తాకిడికి మెల్లగా ఊగినట్లు మన్మథుని సైతం మతి పోగొట్టే అందమైన ఆమె వక్షస్థలం ఉచ్ఛ్వాశ నిశ్వాసలకి లయగా ఊగుతుంటే... ఆ స్తనధ్వజాన్ని అంటిపెట్టుకున్న సన్నని బంగారు గొలుసు విలాసంగా కదులుతుంది. సాగర్ మతిపోయి అటే చూస్తున్నాడు.

"దీన్ని ప్రేమ అంటారా...? మోహం అంటారా...?" జారిన పైటను సర్దుకుంటూ, సూటిగా సాగర్ వైపు చూసి అడిగింది సంధ్య.

అనుకోని ఈ ప్రశ్నకు సాగర్ కాస్త తడబడ్డాడు. నిజానికి ఆ ప్రశ్నకు జవాబు తన దగ్గర లేదనే చెప్పాలి.

అతని మౌనాన్ని చూసి, ఆమె ఓ చిరునవ్వు విసిరి విసురుగా వెనుదిరిగింది. అలా తిరగడంలో కరినాగు లాంటి ఆమె జడ చివర్లు సాగర్ ముఖాన్ని తాకి చురుక్‌మనిపించాయి.



## బేరం

"ఏమిటీ బేరాలు మూరయ్యను ఎవరో పొడిచారట" ఒకతను యింకొక అతన్ని అడిగాడు.

అతను ఇలా చెప్పాడు "ఏముందీ, అతడికీ పక్కింటి వాళ్లకీ గొడవయితే వాళ్లని బెదిరించటానికి కత్తుల రత్తయ్యను తీసుకొని వద్దామనుకొన్నాడు, వాడితో కూడా బేరాలాడేసరికి..."

– ఎన్.రవి
(కాకినాడ)

సాగర్ ఒక్క ఉదుటున ఆమె ముందుకె వెళ్లి తన మనసు తెలియజేసాడు.

"సంధ్యా! నేను ప్రవరాఖ్యుణ్ణి కాను. అలాగని నన్ను దేవదాసుని చేయకు. నీ ప్రశ్నకు జవాబు నా దగ్గర లేదు. కాని, ఒక్కటి మాత్రం నిజం. నీ రూపం నన్ను కదిలించింది. ప్రేమ కళ్ళతో చూడదు మనసుతో చూస్తుంది. నువ్వు కరుణిస్తే నీ నవ్వుల వానలో తడిసి పులకించిపోతాను. నీవు మేనకవైతే నేను విశ్వామిత్రుడినౌతాను . తామరాకు మీద నీటిబొట్టులా నీ కాలి మువ్వనైనా చాలు ఈ జీవితానికి..."

"ఆహా! ఎంత చక్కని భావుకత్వం... మొదట్లో ప్రేమ ఇలాగే ఉంటుందేమో!" అని సంధ్య ఊహించని విధంగా సాగర్ చెక్కిలిని ముద్దాడి పరుగుతీసింది.

* * *

అలా మొదలైన వారి పరిచయం ప్రేమ గా మారింది. ఒకర్ని విడిచి ఒకరు ఉండలేని స్థితికి వచ్చారు. వారి ప్రేమ పెళ్లి వరకూ వచ్చింది.

"ఏయ్! నేనంటే నీకెందుకు ఇంత పిచ్చి...!?" సాగర్ జుత్తులోకి వేళ్ల జొనిపి అతని ముక్కును తన ముక్కుతో రాస్తూ అడిగింది సంధ్య.

"సంధ్యా! నువ్వు మాట్లాడుతుంటే కోకిలగానం దేనికి? నాకిష్టమైన సితార వాయిద్యం విన్నంత తృప్తిగా ఉంటుంది. నీ నవ్వుల వెన్నెల ధారల్లో తడుస్తుంటే ఈ గోదావరి గలగలలు దేనికి? ఈ చల్లని పిల్ల గాలులు దేనికి?" అని ఆమె మెడమీది పుట్టుమచ్చను ముద్దాడాడు. తామరాకు లాంటి ఆమె పాదాన్ని చేతిలోకి తీసుకొని సుతారంగా ముద్దాడి, ఆమె కళ్లల్లోకి చూసి గతుక్కుమన్నాడు. ఆ కలువ కళ్లల్లో సన్నని నీటిపొర.

"ఏయ్ ...! ఏమిటిది...! ఏమైంది?" ఆమె భుజాలు పట్టుకొని అడిగాడు సాగర్.

"నేనంటే నీకెందుకు ఇంత పిచ్చి? జీవితాంతం ఇలాగే ఉంటావా...!?" సంధ్య కన్నుల నుండి రెండు నీటి బిందువులు కిందికి రాలాయి.

"సంధ్యా! నాకు నువ్వు కావాలి. ఈ ప్రపంచం ఏమైనా నాకనవసరం. ఈ గోదావరి సాక్షిగా నువ్వు కాదంటే జీవితాంతం నీ తలపులలో జీవిస్తాను. ఇది నిజం". సాగర్ సీరియస్‌గా గెడ్డం కింద రెండు చేతులు పెట్టుకుని ఓరకంట సంధ్యను చూస్తూ కూర్చున్నాడు.

"కోపమొచ్చిందా! అయితే!... ఇదిగో ఈ పెదవులు కాస్త రుచిచూడు..." సంధ్య సున్నాలా మూతిని పెట్టి ముందుకి వంగింది .

కొబ్బరి ఆకులతో గాలి ఊసులాడడం మానేసింది. గోదావరి మీద గాలి స్తంభించి పోయింది. నీటిలో చేప పిల్లలు చెంగున పైకెగిరి ఆ దృశ్యం చూసి మరంతలోనే బుడుంగుమని మునకేస్తున్నాయి. ఆకాశం ఎప్పుడో నల్లని ముసుగు వేసుకుంది. ఒకటి అర తారలు గుడ్డి దీపాల్లా మిణుకుమిణుకు మంటున్నాయి.

సాగర్, సంధ్య పరిసరాలేవీగమనించడం

లేదు. అస్సలు వాళ్లు ఈ లోకంలో లేరు. వాళ్ల లోకంలో వాళ్లు ఉన్నారు. అతని చేతులు ఆమె శరీర సౌష్టవాన్ని వీణ మీటినట్లు మీటుతుంటే ఆమె నరాలు తీయని రాగాలు పలికిస్తున్నాయి. ఆమె అరవిరిసిన గులాబీలా అతన్ని ఆహ్వానిస్తుంటే అతను దాహంతో, తమకంతో ఆమెను అల్లుకుపోతున్నాడు...

* * *

"లవ్ ఎట్ ఫస్ట్ సైట్" అన్నాడరు. కాని అది ఎంత వరకు నిజమో తెలేదు. యువతీ యువకులు ముందు ఆకర్షణకి లోనవుతారు. తర్వాత ప్రేమ, దోమ అని తిరుగుతారు. ఒకరి గురించి ఇంకొకరు తెలుసుకుంటూరు. కాని, చాలా మంది బాహ్య సౌందర్యానికి విలువ ఇచ్చినంతగా అంతర సౌందర్యానికి ఇవ్వరు. అందుకే చాలా ప్రేమ కథలు కంచికి చేరకుండా మధ్యలోనే ఆగిపోతున్నాయి.

సాగర్ సంధ్యను చూడగానే తనను తాను మరిచిపోయాడు. ఆమె అందమైన విగ్రహాన్ని చూసి బాగా ఆకర్షితుడైనాడు. సంధ్యలాంటి అందమైన స్త్రీని తను ఇంత వరకు చూడలేదు. అందుకే... అందుకే ఆమెను ఎలాగైనా పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు.

సాగర్ బ్యాంకు పనిమీద హైద్రాబాద్ వెళ్లి నాలుగు రోజులు ఉండి వచ్చాడు. ఆ రోజు ఎప్పటిలాగే సాగర్ సంధ్య రాక కోసం ఎదురు చూస్తూ కాలుకాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. ఇంతలోగా పదేళ్ల కుర్రాడు వచ్చి "అంకుల్... అంకుల్ సంధ్యా ఆంటీ మిమ్మల్ని అర్జెంటుగా రమ్మంటుంది..." అని పరుగుదీసాడు. వాడివెంట సాగర్ పరుగు నడకన వెళ్లాడు.

ఆ గదిలోకి వెళ్లేసరికి సాగర్‌కి నోటివెంట మాటరాక పిచ్చివాడిలా చూస్తూ నిల్చున్నాడు. మంచంమీద సంధ్య పడుకొని ఉంది. ఒకవైపు ఆమె ముఖం, మెడ

## రికార్డ్ మ్యాచ్

టెన్నిస్ మాచ్ 1969లో 14 గంటలసేపు జరిగింది. ఇంగ్లండ్‌లో జరిగిన ఈ మాచ్‌లో ఆర్.గోన్‌జేల్స్ (యు.యస్.ఎ) సి.పసరెల్ (యు.ఎస్.ఎ)ని 22–24, 1–6, 16–14, 6–3, 11–9తో ఓడించాడు.

అన్ని గంటలసేపు ఆపకుండా ఆడినందుకు రెండు జట్లకే సమానంగా బహుమానాలు ఇచ్చి ఉండవల్సింది కదా!

– శౌరవి



నల్లగా మాడిపోయి ఉన్నాయి. అందమైన ఆ మెడమీది పుట్టుమచ్చ కనిపించడం లేదు. కిరోసిన్ స్టవ్ పేలి సంధ్యకు ఇలా అయ్యిందిట...! తను హైదరాబాద్ వెళ్లిన రోజే ఈ దుర్ఘటన జరిగిందట...!

సాగర్‌ని చూసి అక్కడున్న సంధ్య తల్లి, తమ్ముడు, చెల్లెలు, నాయనమ్మ మెల్లగా విచారవదనాలతో బయటికి వెళ్లిపోయారు.

సాగర్ మంచంమీద కూర్చొని చెదిరిన ఆమె కురుల్ని సవరిస్తుంటే మెల్లమెల్లగా కనులు తెరిచి చూసిన సంధ్యకు సాగర్ కనులు అశ్రువులతో నిండివున్నాయి.

"ఏయ్! చూడు.. నీ అందమైన సంధ్య ఎలా మారిందో! నన్ను పెళ్లి చేసుకుంటావా...!?" అని సంధ్య వెక్కివెక్కి ఏడవసాగింది.

"సంధ్యా! ప్లీజ్... ఏడవకు.. ఏమైందని...! ఏయ్! చూడు... ఇటు చూడు... నా కళ్లల్లోకి చూడు. ఎవరు కనిపిస్తున్నారు...!? నా సంధ్య. నా గుండెల్లో ఎవరున్నారో తెలుసా...!? నా సంధ్య. ఏయ్! పిచ్చీ..! నాకు నువ్వు కావాలి. నీ నవ్వు కావాలి. సంధ్యా! ప్రేమ కళ్లతో చూడదు.. మనసుతో చూస్తుంది.

సాగర్ సంధ్యను తన చేతుల్లోకి తీసుకున్నాడు.

*

